సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



బొమ్మలతో బోధన 8లో▸

నార్నూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేట్‌కు దీటుగా బోధిస్తున్నారు. గోడలపై ఉన్న వర్ణమాల జంతువులు, పక్షుల బొమ్మలు ద్వారా బోధన అందిస్తున్నారు.



'పది'కి ప్రణాళిక 9లో▸

పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతుండగా విద్యార్థులు 10 జీపీఏ సాధనే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.1/12.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు తగ్గుతాయి. మంచుకురుస్తుంది. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రి సబితకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

బోథ్: నియోజకవర్గ కేంద్రానికి జనరల్ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గంలోని పలు విద్యా సమస్యలు తెలుపగా పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

6న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 6న జాబ్, అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్ టెలీసర్వీస్ వారు నెట్‌వర్క్ ఇంజనీర్ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఐటీఐ పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువాలు కప్పుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: మున్సిపాల్టీ పరిధిలోని రణదీవే నగర్, భాగ్యనగర్ కాలనీలకు చెందిన పలువురు యువకులు గురువారం బీజేపీ చేరారు. ఆదిలాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వీరికి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సంపదను పక్క రాష్ట్రాలకు పంచి పెట్టేలా ప్రణాళికలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే యువత బీజేపీకి ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంజేశారు. నాయకులు జోగు రవి, ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, దినేశ్ మటోలియా, వేద వ్యాస్, ఆశిష్, ముకుంద్‌రావు పాల్గొన్నారు.

నాందేడ్ సభ విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 5న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ మహాసభ విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. గురువారం మహారాష్ట్రలోని ఘాటంజిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. సీఎం సభకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నాగయ్య, మహేందర్, వినోద్, నరేశ్, ఉమేశ్ తదితరులున్నారు.

7నుంచి యువతకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: యువతకు నాయకత్వ లక్షణాలపై ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని వైటీసీలో శిక్షణ ఇవ్వనున్నట్లు యువజన అధికారి సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిత్వ వికాసం, ఉత్తమ సంస్కరణలను అలవర్చుకోవడం, ప్రాథమిక జీవిత నైపుణ్యాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే వారికి భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 40 మందికి మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తిగలవారు నెహ్రూ యువకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ కిరణ్‌కుమార్, తేజ, విజయలక్ష్మి

జిల్లా ఉపాధికల్పన కార్యాలయం

చేయి తడిపితేనే ఆర్డర్!

- ఏటీఎంలా అవుట్‌సోర్సింగ్ ప్రక్రియ!
- ఎంప్లాయిమెంట్ అధికారి చేతివాటం!
- అధికారికి వంత పాడిన సిబ్బంది..
- ఎంప్యానల్మెంట్ నుంచి మొదలుకుంటే.. ప్రతిదాంట్లో నిక్కచ్చిగా వసూళ్లు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో చేయి తడపందే ఏ ప్రభుత్వ పని కావడంలేదు. అంతో.. ఇంతో సమర్పించుకుంటేనే పని అవుతోంది. ఇందుకు జిల్లాలో జరిగిన అనేక ఘటనలు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎంప్యానల్మెంట్‌లో ఉన్న ఏజెన్సీలకు ఆయా ప్రభుత్వ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నిర్వహణ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. కొత్తగా సృష్టించిన ఇలాంటి ఉద్యోగాలనే ఈ ఏజెన్సీల్లో ఏదానికైనా ఇవ్వాలి. దీంట్లో జిల్లా ఉపాధికల్పనాధికారి బాధ్యత కీలకం. సాధారణంగా ఈ మొత్తం ప్రక్రియలో ఏజెన్సీల ఎంపిక నుంచి మొదలుకొంటే ఉద్యోగాల కేటాయింపు వంటి అన్ని వ్యవహారాల నిర్వహణను ఈ శాఖ అధికారులు ఎనీ టైమ్ మనీ లాగా మార్చుకున్నారు. ఇందుకు ఇటీవల ఇద్దరు ఎంప్లాయ్‌మెంట్ శాఖ అధికారులు, ఒక రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వ్యవహారమే నిదర్శనం.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ప్రక్రియ పూర్తిగా గాడి తప్పిందన్న విమర్శలు ముందునుంచీ ఉన్నాయి. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు సంబంధించి ఎంప్యానల్మెంట్ రూపొందించడంలో ఉపాధికల్పన అధికారిదే కీలక పాత్ర. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్యను ఏజెన్సీలకు పంచడంలోనూ కీలకంగా వ్యవహరిస్తారు. అయితే ఈ సెలక్షన్ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఉపాధికల్పన శాఖ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. అయితే ఈ వ్యవహారాలన్నింటినీ పరిశీలించేది ఉపాధికల్పన శాఖ అధికారే కావడంతో దీన్ని ఒక అక్రమ వ్యవహారంలా మలుచుకొని ఇష్టారీతిన ఏజెన్సీల నియామకం, ఉద్యోగాల పంపకం, నియామకాలప్పుడు ఏజెన్సీలతో కలిసి నిరుద్యోగుల నుంచి అక్రమ వసూళ్లు చేయడం లాంటి అనేక తతంగాలకు ఎంప్లాయ్‌మెంట్ శాఖ కేంద్ర బిందువవుతోంది. మొత్తంగా ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా ఈ వ్యవహారం బయటకు తీసుకురాగా ఇందులోని అక్రమాలు ఒక్కటొక్కటిగా బయటకొస్తున్నాయి. అయితే సెలక్షన్ కమిటీ దీన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించకపోవడంతోనే ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఏం చేసినా పట్టించుకునే వారు లేరు. ఇదే గత కొన్నేళ్లుగా జిల్లాలో నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

ఆర్డర్ ఇవ్వాలంటే రూ.లక్షలే..

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తగా పలు పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తున్నారు. దీంట్లో భాగంగానే 24 పేషెంట్‌కేర్ ప్రొవైడర్ పోస్టులు మంజూరయ్యాయి. వీటిని జిల్లాకేంద్రంలోని దుర్గం ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ దక్కించుకుంది. దీనికి సంబంధించి ఎంప్లాయ్‌మెంట్ అధికారి నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలి. ఆ కాపీని సంబంధిత శాఖ.. అంటే రిమ్స్ ఉన్నతాధికారికి ఏజెన్సీ అందించాల్సి ఉంటుంది. అప్పుడు ఆ ఉన్నతాధికారి ఆ 24 పోస్టులకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను సంబంధిత ఏజెన్సీకి అందజేస్తారు. ఆ తర్వాత ఈ పోస్టుల నియామకం ఏజెన్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి ప్రభుత్వ పర్యవేక్షణలో నియామకం చేపడతారు. ఈ అలాట్‌మెంట్ ఆర్డర్ ఏజెన్సీకి ఇచ్చేందుకు ఎంప్లాయ్‌మెంట్ శాఖ అధికారి బేరసారాలకు దిగారు. రూ.3లక్షలు ఇస్తే ఆర్డర్ కాపీ ఇవ్వనున్నట్లు తెగేసి చెప్పాడు. దీంతో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు దుర్గం శేఖర్ గతనెల 25న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు ఇది నిజమా? కాదా? అని పూర్తిస్థాయిలో నిర్ధారణ చేసుకొని రంగంలోకి దిగారు. పక్కాగా వల వేశారు. అందులో భాగంగా జనవరి 31న ఏజెన్సీ నిర్వాహకుడు ఎంప్లాయ్‌మెంట్ అధికారిని తాను అంత డబ్బులు ఇచ్చుకోలేనని, కొంత తగ్గించుకోవాలని కోరగా, చివరకు రూ.2.25 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆ డబ్బులను ఇచ్చేందుకు ఏజెన్సీ నిర్వాహకుడు రాగా, రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ తేజకు ఇవ్వాలని చెప్పగా అలానే చేశాడు. ఆ డబ్బులను జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మికి ఇవ్వాలని ఎంప్లాయ్‌మెంట్ అధికారి కిరణ్‌కుమార్ చెప్పగా తేజ అలాగే ఇచ్చాడు. అప్పటికే ఆ డబ్బులకు ఏసీబీ అధికారులు రసాయనాలు పూసి ఉంచడంతో తేజ, విజయలక్ష్మి వేలిముద్రలు నిర్ధారణ అయ్యాయి. వారు ఎంప్లాయ్‌మెంట్ అధికారి చెప్పినట్లుగా చేశామన్నారు. ఈ కేసులో వారి భాగస్వామ్యం కూడా ఉండడంతో ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో నిర్ధారణ చేసుకొని ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఏ–1గా ఎంప్లాయ్‌మెంట్ అధికారి కిరణ్‌కుమార్, ఏ–2గా రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ తేజ, ఏ–3గా ఎంప్లాయ్‌మెంట్ జూనియర్ అధికారి విజయలక్ష్మిని చేర్చారు.

మొక్కజొన్నపై మక్కువ



సిరికొండలో సాగవుతున్న మొక్కజొన్న



ఈ ఫొటోలోని వ్యక్తి ఇచ్చోడ మండలం అడెగామ (బీ) గ్రామానికి చెందిన కామాజీ. గతేడాది అరెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. లాభసాటిగా ఉండడంతో ఈ ఏడాది ఎనిమిదెకరాల్లో సాగు చేస్తున్నాడు. కనీసం 250 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే ధీమాతో ఉన్నాడు. యాసంగిలో ఇతర పంటల కంటే మొక్కజొన్న తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుండడంతోనే ఏటా మొక్కజొన్న సాగు పెంచుతున్నట్లు తెలిపాడు. ఇది ఈ ఒక్కరైతు చెబుతున్న మాట కాదు.. జిల్లాలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులంతా ఇదే అభిప్రాయం వ్యక్తంజేస్తున్నారు.

- రబీలో పెరుగుతున్న సాగువిస్తీర్ణం
- లాభసాటి పంట కావడంతోనే..
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- జిల్లాలో 13,417 ఎకరాల్లో సాగు

ఇచ్చోడ: మొక్కజొన్న సాగుపై జిల్లా రైతులకు మక్కువ తగ్గడంలేదు. సర్కారు సాగు వద్దన్నా రైతులు మాత్రం యాసంగిలో ప్రధాన పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. 2019లో మొదటిసారి తెలంగాణ ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించింది. క్వింటాల్‌కు రూ.1,760 ధర ప్రకటిస్తూ.. రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో జిల్లాలో అప్పటివరకు సాగవుతున్న మొక్కజొన్న విస్తీర్ణం రెండింతలు పెరిగింది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించగా ఆ ఏడాది జిల్లాలో రికార్డు స్థాయిలో 35వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. 2020లో సర్కారు ఆంక్షలు విధించింది. మొక్కజొన్న సాగు చేయొద్దని, పంటను ప్రభుత్వం కొనుగోలు చేయదని ప్రకటించింది. అప్పటివరకు యాసంగిలో అధిక విస్తీర్ణంలో సాగు చేసిన మొక్కజొన్న రైతులు సాగు తగ్గించారు. ప్రత్యామ్నాయంగా రబీలో ఇతర ఆరుతడి పంటలు సాగు చేస్తూ వచ్చారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, మొక్కజొన్న లాభసాటి పంట కావడం, ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1,300 నుంచి రూ.1,400వరకు ధర లభిస్తుండడంతో సాగు పెంచుతూ వస్తున్నారు. ప్రభుత్వం వద్దన్నా గడిచిన మూడేళ్లుగా యాసంగిలో మళ్లీ మొక్కజొన్న సాగు క్రమంగా పెరుగుతోంది.

జిల్లాలో సాగు వివరాలు	
సంవత్సరం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో..
2020–21	4,600
2021–22	8,303
2022–23	13,417

లాభసాటి పంట కావడంతోనే..

లాభసాటి పంటల్లో మొక్కజొన్న ప్రధానమైంది. యాసంగిలో జిల్లాలో ఎక్కువగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. విత్తనాలతోపాటు ఎరువుల వాడకం పంట ఏపుగా దశలో మరో రెండుసార్లు రసాయనిక ఎరువుల వాడకంతో పంట చేతికివస్తుంది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురిసినా పెద్దగా నష్టం ఉండదు. ఎకరం మొక్కజొన్న సాగుకు రూ.5వేల లోపే ఖర్చు అవుతుండగా కనీసం 30 నుంచి 40క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయకున్నా ప్రైవేట్‌లో రైతు తన పంటను విక్రయించుకోవచ్చు. పెట్టుబడి ఖర్చులు పోను ఎకరంలో రూ.30 నుంచి రూ.40వేల వరకు మిగులుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు

మొక్కజొన్న పంట కొనుగోళ్లను గతంలో ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ఏడాది పంటల కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులు గమనించాలి.

– శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి

కంటివెలుగు పకడ్బందీగా నిర్వహించాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంద్రవెల్లి: కంటివెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు అందించిన సేవల వివరాలు తెలుసుకున్నారు. కళ్లద్దాలు అవసరమైన వారికి 15నుంచి 20రోజుల్లో లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందించాలని సూచించారు. 18 ఏండ్లు పైబడిన వారంతా కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కేస్లాపూర్‌ని నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. నాగోబా ప్రతిమను అందించారు. జిల్లా వైద్యాధికారి నరేందర్‌రాథోడ్, అదనపు వైద్యాధికారి విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, తహసీల్దార్ ముంజం సోము, ఎంపీడీవో పుష్పలత, సర్పంచులు కోరెంగా గాంధారి, మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం వంశీయులు, అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ నుంచి పీజీహెచ్‌ఎం పదోన్నతి పొందే ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను గురువారం డీఈవో కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో పరిశీలించారు. 19 మంది ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. డీఈవో ప్రణీత ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి ఆయా మండలాల్లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇందుకు ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరు కౌంటర్లలో బదిలీ దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదివరకు స్పౌజ్ వాడుకున్నవారి వివరాలను పరిశీలించేందుకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరీ ఉపాధ్యాయుల కోసం మరో కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత ఎంఈవోలు ఆన్‌లైన్ దరఖాస్తులను శుక్రవారం ఉదయం డీఈవో కార్యాలయంలో అందించాలని ఆదేశించారు.

క్రీడలతో సత్సంబంధాలు



బేల జట్టుకు ప్రథమ బహుమతి ఇస్తున్న మనోహర్

బేల: ప్రాంతాల మధ్య క్రీడలతో సత్సంబంధాలు పెరుగుతాయని, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పేర్కొన్నారు. గురువారం గత 45రోజులుగా పఠాన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విజేతగా నిలిచిన బేల సూపర్‌కింగ్ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.41వేలు, రన్నరప్‌గా నిలిచిన దోరి (మహారాష్ట్ర) జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.20వేలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అందజేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు తన్వీర్‌ఖాన్, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఠాక్రే గంభీర్, నాయకులు సతీశ్ పవార్, ఇంద్రశేఖర్, ప్రమోద్‌రెడ్డి, గోడం సునీల్, గుండవార్ ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు స్పెషల్ బస్సు

ఆదిలాబాద్: వ్యాపారులతోపాటు వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం స్పెషల్ సర్వీసును (సూపర్ లగ్జరీ) ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 3.30కి ఆదిలాబాద్ డిపో నుంచి బయలుదేరి 9.30 గంటలకు సికింద్రాబాద్ (జేబీఎస్) చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ సర్వీసు శుక్రవారం నుంచి అందుబాటులోకి రానుందని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నటరాజ్

కైలాస్‌నగర్: లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, సివిల్ సప్లయ్, జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా.. సకాలంలో అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా సంక్షేమ అధికారులు చొరవ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీకి అందిన ఫిర్యాదుల ఆధారంగా సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఫిర్యాదుల నివృత్తి అధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని నియమించినట్లు తెలిపారు. అంతకుముందు ప్రసవ సమయంలో అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలపై సంక్షేమ శాఖల అధికారులు, వైద్యశాఖ అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, సంక్షేమ శాఖల అధికారులు మిల్కా, కృష్ణవేణి, రాజలింగం, సంధ్యారాణి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న మహేందర్‌జాదవ్

నేరడిగొండ: ఈ నెల 15న శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న 'చలో హైదరాబాద్'కు లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంజారాలు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతను బంజారా ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, గ్రామ నాయక్, కారోబార్, ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ గిరిజన లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ సుధాకర్, రాథోడ్ నరహరి దాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావు, ఆడే సునీల్, గణపత్, సేవాదాస్, బానోత్ రవీందర్, కన్వీనర్ జాదవ్ వినోద్, రాథోడ్ సందీప్, రాథోడ్ జైపాల్, జాదవ్ దయాకర్, జాదవ్ కవిత, జాదవ్ విద్యారాణి, శంకర్, కిరణ్, పవిందర్, సుదన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



రాత్రి కూడా నిరసన తెలుపుతున్న స్టాఫ్‌నర్సులు

ఆదిలాబాద్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఎదుట 300 మంది ఓసీఎస్ స్టాఫ్ నర్సులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరోరోజుకు చేరింది. గురువారం సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో బీఆర్‌ఎస్ పాలన కొనసాగుతుందని విమర్శించారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు సేవలందించిన నర్సులకు 8 నెలలుగా జీతాలు ఇవ్వకుండా పనిచేయించుకోవడం దారుణమన్నారు. నర్సుల వేతనాలు వెంటనే చెల్లించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పట్టణాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లాలా మున్నా, జోగు రవి, దినేశ్ మటోలియా, ముకుంద్, మయూర్ చంద్ర, సిద్దు తదితరులున్నారు.

24 గంటల నిరసన

ఎదులాపురం: వీరి డిమాండ్లకు అధికారులు స్పందించకపోవడంతో గురువారం 24 గంటలు నిరసన చేపట్టారు. రాత్రి శిబిరంలోనే ఉంటూ నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బొజ్జ ఆశన్న, కిరణ్ మద్దతు తెలిపారు.

ప్రయాణికులను సురక్షితంగా చేర్చాలి



మాట్లాడుతున్న జానీరెడ్డి, పక్కన డీఎం కల్పన

ఆదిలాబాద్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని, ఇందుకు హైర్ బస్సు డ్రైవర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోగల ఆర్టీసీ బస్సు డిపోలోని ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన హైర్ బస్సు డ్రైవర్ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద రహితంగా బస్సులను నడిపేలా, అలాగే ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించేలా డ్రైవర్లకు ఆరు రోజులపాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే వారికి ప్రయోగపూర్వకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లంతా శిక్షణను సద్వినియోగం చేసుకొని, మెలకువలు పెంపొందించుకొని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అంతకుముందు డ్రైవర్లకు పలు సలహాలు సూచనలు చేశారు. డీఎం కే కల్పన, అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జీ విష్ణు, సేఫ్టీ వార్డెన్ ఎస్కే యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.





వంగిన విద్యుత్ స్తంభాలు..

పంట చేలల్లో వ్యవసాయ సాగు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లకు సంబంధించిన స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వంగిపోయిన స్తంభాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అందుకు అద్దం పట్టే ఈ చిత్రం జైనథ్ మండలం ఆనంద్‌పూర్‌లో కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

రేపు అండర్-15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్స్ అండర్-15 బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 11, 12వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు గోలేటి షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లును 9866652 249 నంబరులో సంప్రదించాలని కోరారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44 డోంగర్‌గావ్ వద్ద లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణప్రాయం తప్పింది. మైదా పిండి బస్తాలతో హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులోని పిండి బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు గ్యారేజీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలోని కారు గ్యారేజీలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్యారేజీలో చొరబడి రూ.40వేలు దొంగలించి తీసుకెళ్లినట్లు గ్యారేజ్ యజమాని మోసిన్ తెలిపారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


యోగేశ్ (ఫైల్)

ముధోల్: మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలోని బట్టిగల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నాయనోల్ల యోగేశ్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ బుద్ధ తెలిపారు.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామ శివారులో అటవీశాఖ అధికారులు గురువారం లేగదూడ మృతదేహాన్ని గుర్తించారు. మోహన్‌కు చెందిన లేగదూడ మేతకు వెళ్లగా చిరుత దాడిచేసి చంపినట్లు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని బీట్ అధికారి వెన్నెల పరిశీలించి చిరుత దాడిచేసినట్లు నిర్ధారించారు.

చేపలవేటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


తోకల గంగారాం (ఫైల్)

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన తోకల గంగారాం(43) బుధవారం ఉదయం సముందర్‌పల్లి గ్రామం శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పిలోకి చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కానరాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీంరావు తెలిపారు.

గుస్సాడీ బృందానికి పీవో అభినందన


ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి గుస్సాడీ టోపిని బహూకరిస్తున్న బృందం సభ్యులు

నార్నూర్(జైనూర్): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చి వచ్చిన పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు బృందాన్ని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర స్థాయి నుంచి సౌత్‌జోన్, నార్త్ జోన్ కళా ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుస్సాడీ కళాకారులు పీవోను కలిసి గుస్సాడీ టోపి బహూకరించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు బయటి ప్రపంచానికి పరిచయం చేయడానికి సహాయ సహకారాలు అందించిన పీవో బదిలీ బాధాకరమని అన్నారు. విద్యాభివృద్ధి కోసం అక్షరజ్యోతి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఆశ్రమ పాఠశాలల్లో అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్ సావిత్రి ధర్మేందర్, గ్రామం పటేల్ మాణిక్‌రావు, మాజీ సర్పంచ్ కనక కొద్దు, హైమన్ డార్ఫ్ యూత్ గుస్సాడీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం


టెండర్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సబ్ డివిజన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించినట్లు ఎఫ్‌డీవో బర్నోబా తెలిపారు. 198 పాత వాహనాలకు వేలం నిర్వహించగా 144 వాహనాలకు టెండర్లు దాఖలయ్యాయి. ఈ వేలం ద్వారా అటవీశాఖకు రూ.45లక్షల40వేల ఆదాయం సమకూరింది. మరో 54 వాహనాలకు వివిధ కారణాలతో వేలం రద్దు చేశారు. అలాగే టెండర్లలో పాల్గొన్న వ్యాపారులు చెల్లించిన ఈఎండీ ద్వారా మరో రూ.2లక్షల72వేలు వచ్చినట్లు ఎఫ్‌డీవో వివరించారు. ఇందులో ఎంపీఏ ప్రదీప్‌కుమార్ ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్ ఎఫ్ఆర్వోలు పాండురంగ్, గణేష్, ప్రణయ్ ఉన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల షెడ్యూలు విడుదల

నిర్మల్ రూరల్: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల షెడ్యూల్ విడుదలైందని డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు 4 రోజులు ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని వివరించారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్ పరీక్షలు ఫిబ్రవరి 11న ఉదయం, మధ్యాహ్నం వేళలో మొదటి, రెండో పేపర్ల పరీక్షలు ఉంటాయని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఫిబ్రవరి 12న ఉదయం, మధ్యాహ్నం మొదటి, రెండవ పేపర్లు ఫిబ్రవరి 13న మూడో పేపర్ పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు 156 మంది, డ్రాయింగ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షకు 87 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్ పరీక్షకు 70 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్‌గ్రేడ్ పరీక్షకు 31 మంది మొత్తం 344 మంది టెక్నికల్ సర్టిఫికెట్‌సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు రాయాలని తెలిపారు. తమ పరీక్షల హాల్ టికెట్లను www.bsetelangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

11న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కైలాస్‌నగర్: ఈ నెల 11న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో బీ గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయీ కమిటీ, ప్రణాళిక, ఆర్థిక స్థాయీ సంఘ సమావేశాలు ఆయా కమిటీల అధ్యక్షుల నేతృత్వంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈనెల 7లోగా తమ శాఖ ప్రగతి నివేదికలను 40 కాపీల చొప్పున తన కార్యాలయానికి పంపించాలని సూచించారు. సంబంధిత సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి


పుస్తకాలు అందిస్తున్న జీసీడీవో ధాయ

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఇప్పటి నుంచే కృషి చేయాలని జీసీడీవో ధాయ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ నుంచి అందించిన ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఏ గ్రేడ్ సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అదే విధంగా వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్


అమ్మవారికి పూజలు చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసా: జిల్లా నూతన కలెక్టర్ వరుణ్‌రెడ్డి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆర్డీవో రవికుమార్, తదితరులున్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు వినతి..

బాసర మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం బాసర వచ్చిన ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. గోదావరి వంతెనపై రక్షణ కంచె ఏర్పాటు చేయించాలని కోరారు.

కొనసాగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతర


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా సమీపంలోని గుట్టపై సమ్మక్క - సారలమ్మ జాతర కొనసాగుతోంది. గురువారం భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారం(బెల్లం) సమర్పించారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చారు. భక్తుల కోసం ఆలయ వ్యవస్థాపకురాలు రేణుకమ్మ ఏర్పాట్లు చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్రం ప్రారంభం


యూనిఫారం ఇస్తున్న యాదవ్‌రావు

బేల: మండలంలోని సైద్‌పూర్ గ్రామంలోని బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఉమ్మడి జిల్లా స్కౌట్స్ మాస్టర్ యాదవ్‌రావు ప్రారంభించారు. దీంతో పాటు విద్యార్థులకు ఆ యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ గణేష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్ పవార్, సీనియర్ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, ఉదారి నారాయణ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటిని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీలో రంజాన్‌ఖాన్ ఓ ఇల్లు కొనుగోలు చేశాడు. ఇందులో తన కూతురు రిజ్వాన్ బేగంకు ఒక పోర్షన్ ఇచ్చాడు. రిజ్వాన బేగం అన్న వదినలైన షబ్బీర్ ఖాన్, షమీమ్‌లు ఇంటిని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడడంతో పాటు దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల గురి తప్పొద్దు


ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


టియర్ గ్యాస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

● ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

తలమడుగు: పోలీసులు శిక్షణ సమయంలో నేర్చుకున్న ఫైరింగ్‌లో గురి తప్పవద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సుంకిడి ఫైరింగ్ బట్ మైదానంలో ఫైరింగ్ ప్రాక్టీసును పరిశీలించారు. అనంతరం ఎస్పీ ఫైరింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు శిక్షణ సమయంలో నేర్చుకున్న మెళకువలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలోని కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు ప్రతిఒక్కరూ వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ చేయడం జరుగుతుందన్నారు. వజ్ర వాహనంలోని టియర్ గ్యాస్ షెల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, సమయ్ జాన్‌రావు, డీఎస్పీ ఉమేందర్ ఉన్నారు.

మంత్రి, సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే


ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే

ఖానాపూర్: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల విషయమై ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తోపాటు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ నర్సింగరావును హైదరాబాద్‌లో గురువారం వేర్వేరుగా కలిశారు. నియోజకవర్గంలోని పలు బీటీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల విషయమై మంత్రికి విన్నవించారు. నియోజకవర్గంతోపాటు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు డీఎంఎఫ్‌టీ ఇతర నిధుల కోసం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని కలిశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రాజేందర్, నాయకులు ప్రదీప్, చరణ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదబీమా పథకంతో తోడ్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: ప్రమాదబీమా పథకాలతో పేద, మధ్యతరగతి తరగతి కుటుంబాలకు ఎంతగానో తోడ్పాటును అందజేస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం మాట్లాడారు. సన్నకారు రైతులు, చిరు ఉద్యోగులకు బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. గ్రోమోర్ సంస్థ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.59 ప్రీమియంతో రూ. 2.50 లక్షల వరకు ప్రమాద బీమా లభ్యమవుతుందని వివరించారు. అదేవిధంగా రూ.5వేల ఆర్థిక సహాయం సైతం పిల్లల చదువు కోసం అందుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే సన్నకారు రైతులు, కుల వృత్తిదారులు, చిరు వ్యాపారులు, చిరు ఉద్యోగులకు పథకానికి సంబంధించిన ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు గందె విజయ్ కుమార్, గటిక క్రాంతి కుమార్, సంతోశ్ కొత్తపెల్లి తదితరులు ఉన్నారు.

నేరడిగొండలో దొంగలు పడ్డారని పుకార్లు


వడూర్‌లో గస్తీ కాస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండల కేంద్రంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారనే వార్త పుకార్లు రేపింది. దీంతో పలు గ్రామాల్లో స్థానికులు గస్తీ కాశారు. అయితే మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్ ఇంటి వద్ద కొంతమంది మహారాష్ట్రకు చెందిన వారు కనిపించారు. దీంతో వారిని దొంగలనే అనుమానంతో స్థానికులు అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు సేకరించి వారు దొంగలు కారని తేల్చి వదిలిపెట్టారు. అప్పటికే మండల కేంద్రంలో దొంగలు పడ్డారనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించింది.

బొమ్మలతో బోధన


గోడలపై గీయించిన బొమ్మలు


గోడలపై గీసిన సైన్స్ బొమ్మలు


పాఠశాల గోడలపై ప్రధానమైన బొమ్మలు

నార్నూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠశాల గోడలపై ఉపాధ్యాయుల సహకారంతో తెలుగు, ఇంగ్లీష్ వర్ణమాల, అంకెలు, సంఖ్యలు, వాడుక భాషలో కనిపించే ఆంగ్ల పదాలు, జంతువులు, పక్షులు, సైన్స్‌కు సంబంధించిన చిత్రాలు గీయించారు. వాటిని చూపుతూ బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థం అవడంతో పాటు ఎప్పటికీ గుర్తుంటాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. బొమ్మలతో విద్యాబోధన చేయడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ హరిచంద్ తెలిపారు.